నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, శనివారం 21 సెప్టెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

ఆయకట్టు ఆగమాగం

- భారీ వర్షాలతో తెగిన సాగర్ కాలువలకు మరమ్మతులు లేవాయె..
- జిల్లాలో నీరందక ఎండిపోయిన సాగర్ ఆయకట్టు పొలాలు, చేలు
- పొట్ట, పాలు పోసుకునే దశలోనే నేలవాలుతున్న వరి, ఇతర పంటలు
- ఆవేదనతో రోడ్డెక్కుతున్న రైతులు.. తోడుగా వస్తున్న పార్టీలు, సంఘాలు
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ కార్యాలయాల వద్ద ధర్నాలు
- కలెక్టరేట్, ఎన్నెస్పీ ఆఫీసుల వద్ద రైతు సంఘాల ఆందోళనలు

భారీ వర్షాలు, వరదలు ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ రంగాన్ని దెబ్బ తీశాయి. కర్షకులను కుదేలు చేశాయి. నాగార్జున సాగర్ కాలువలకు ఎక్కడికక్కడ గండ్లు పెట్టి పంట భూములకు నీరందించకుండా చేశాయి. వరదలతో పంటలు కొట్టుకుపోయిన బాధ నుంచి అన్నదాతలు తేరుకోకముందే వారం రోజులుగా తీవ్రతను పెంచిన ఎండలు ఉన్న పంటలను ఎండబెడుతున్నాయి. వర్షాలు తగ్గి 20 రోజులైనా ప్రభుత్వం దెబ్బ తిన్న కాలువలకు మరమ్మతు పనులు పూర్తి చేయలేదు. ఆయకట్టు భూములకు సాగు నీటిని విడుదల చేయడం లేదు. దీంతో ఆ నీటినే నమ్ముకొని రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. కల్లూరు, చింతకాని తదితర మండలాల్లో పొట్ట దశలో ఉన్న పొలాలకు నీరందక బీళ్లు వారుతున్నాయి. దీంతో అన్నదాతలు ఆగ్రహించి రోడ్లపైకి వస్తున్నారు. వీరికి బీఆర్ఎస్ సహా పలు పార్టీల నాయకులు మద్దతుగా నిలుస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు ఎండిన పంటలను పరిశీలించి ఇరిగేషన్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడుతున్నారు. సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు, వాటి అనుబంధ రైతు సంఘాల బాధ్యులు కూడా రైతులను కూడగట్టి కలెక్టరేట్, ఎన్నెస్పీ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వెంటనే సాగర్ కాలువలకు మరమ్మతు పనులు చేపట్టి ఎండిపోతున్న పంటలకు నీరందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోకుండా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

చింతకానిలో ఎండుతున్న వరిని చూపిస్తూ నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

వరి, మిర్చి, పత్తి పంటలకు సాగునీరివ్వాలి

ఎన్నెస్పీ జలాల కోసం కల్లూరులో బీఆర్ఎస్ నాయకులు, రైతుల ధర్నా

కల్లూరులోని ఎన్నెస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెనుబల్లి, సెప్టెంబర్ 20: ఎండల తీవ్రత పెరగడంతో పొట్ట దశలో ఉన్న వరితోపాటు పత్తి, మిర్చి పంటలకు నీరందక ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ నాయకులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకని వెంటనే ఎన్నెస్పీ జలాలను విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులు, రైతులు కలిసి కల్లూరులోని ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పలువురు మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో సాగర్ కాలువలు దెబ్బతిన్నాయని, దాదాపు 20 రోజులు దాటినా వాటిని మరమ్మతు చేయడం లేదని అన్నారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా.. కనీసం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇటీవల సీతారామ ప్రాజెక్టు కాలువలను ప్రారంభించి హడావిడి చేసి నీళ్లు ఇవ్వకపోవడంతో కల్లూరు, పెనుబల్లిల్లోని పంట భూములకు సాగు నీరు అందడం లేదని విమర్శించారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులకు, ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ నేతలు పాలెపు రామారావు, కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, మేకల కృష్ణ, షేక్ కమిలీ, నర్వనేని అంజయ్య, పెద్ద బోయిన మల్లేశ్వరరావు, కాటంనేని వెంకటేశ్వరరావు, రాయి సూర్యనారాయణ, గొల్లమందల ప్రసాద్, గంగవరపు శ్రీను, నామా వెంకటేశ్వరరావు, కిశోర్, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నెస్పీ జలాలను తక్షణమే విడుదల చేయాలి

చింతకానిలో ఎండిన పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

చింతకానిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

చింతకాని, సెప్టెంబర్ 20: సాగర్ జలాలను నమ్ముకొని రైతులు పంటలు వేస్తే.. తీరా ఇప్పుడవి రాకపోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయకట్టులో అన్నదాతల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే సాగర్ జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చింతకాని మండలంలో శుక్రవారం పర్యటించిన బీఆర్ఎస్ నాయకులు.. కోమట్లగూడెం, నేరడ తదితర గ్రామాల్లో ఎండిపోతున్న వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాగర్ ఆయకట్టు పరిధి గ్రామాల్లోని రైతులు 2 వేలకుపైగా ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగు చేశారని అన్నారు. ప్రస్తుతం నీరు లేకపోవడంతో ఆ పంట పొలాలు బీళ్లు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సాగర్ కాలువలకు గండ్లు పూడ్చి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ అనంతరాజుకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నేతలు, రైతులు మంకెన రమేశ్, వెంకట్రామారావు, గడ్డం శ్రీనివాసరావు, గురజాల హనుమంతరావు, నర్సయ్య, శ్రీను, పర్చగాని ఏడుకొండలు, ఆదిరెడ్డి, అంకాలు, వెంకటేశ్వర్లు, బాబు, పూర్ణారావు, సీతారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆయకట్టు ఎండిపోతున్నది: బాగం

ఖమ్మంలోని ఎన్నెస్పీ కార్యాలయంలోకి వెళ్తున్న సీపీఐ అనుబంధ రైతు సంఘం నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

ఖమ్మం కమాన్‌బజార్, సెప్టెంబర్ 20: ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే సాగర్ ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండిపోతున్నాయని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (సీపీఐ అనుబంధ) జిల్లా అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. సాగర్ కాలువకు మరమ్మతులు చేపట్టి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని భూములకు నీటిని విడుదల చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులోని నీటిపారుదలశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రోజుల క్రితం సాగర్ కాల్వకు గండిపడినా ఇంతవరకు మరమ్మతులు చేయలేదని మండిపడ్డారు. దీంతో ఆయకట్టు పరిధిలోని భూములకు నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం ఎన్నెస్పీ ఈఈకి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మౌలానా, జితేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రవీంద్రబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువ గండ్లు పూడ్చాలి: బొంతు

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకులు

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 20: సాగర్ ఎడమ కాలువకు పడిన గండ్లను వెంటనే పూడ్చి రైతుల సాగు భూములకు నీరివ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ వారం రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సాగర్ కాలువలకు మరమ్మతు చేపట్టి పంట భూములకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న వరి, పత్తి, మిర్చి పంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

అయ్యో పాపం.. అంగన్‌వాడీలు

- అద్దె బకాయిలతో సతమతమవుతున్న టీచర్లు
- ఆరు నెలలుగా సొంతంగా చెల్లింపులు
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామంటూ ఆవేదన
- నోరు మెదపకుండా జాగ్రత్త పడుతున్న సీడీపీవోలు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

జిల్లాలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు: 1,840
అద్దె భవనాల అంగన్‌వాడీ సెంటర్లు: 448
ప్రతినెలా చెల్లించాల్సిన కిరాయిలు: రూ.22.60 లక్షలు

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 20: ఖమ్మం జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు అద్దె భవనాల కిరాయిలు చెల్లించలేక సతమతమవుతున్నారు. అంతేకాదు అనేక సర్వేలు, ఇతర శాఖల పనులు సైతం అప్పగించడంతో అంగన్‌వాడీ కేంద్రంలో ఒక్కపూట కూడా ఉండే పరిస్థితి లేకుండా పోతున్నది. ఇకపోతే.. పోషణ్ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ వంటి రిపోర్టులు, సర్వేలను ప్రత్యేక సైట్‌లోనే నమోదు చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. వాటికి అవసరమైన, సపోర్టు చేసే ఫోన్లు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. అన్నీ తట్టుకొని ఏదో రకంగా సేవలు కొనసాగిస్తున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు వారిని చుట్టుముడుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో నేటివరకు ఒక్క నెల కూడా అద్దె బకాయిలు విడుదల కాకపోవడంతోపాటు పెట్టుబడి పెట్టి తీసుకొచ్చిన కూరగాయలు, గ్యాస్ బిల్లుల భారం సైతం టీచర్లపై పడుతుండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తమకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే తమను పట్టించుకున్న పాపానపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి వరకు కార్యకర్తగా ఉన్న పేరును తొలగించి టీచర్‌గా చేర్చి ఉత్తర్వులు జారీ చేయడం, మూడుసార్లు టీచర్లకు, హెల్పర్లకు వేతనాలు పెంచడంతో గత కేసీఆర్ సర్కార్ హయాంలో ఎంతో ఉత్సాహంగా పని చేశామని చెబుతున్నారు. రూ.2,500 నుంచి రూ.13,500 వరకు టీచర్లకు, రూ.1,800 నుంచి రూ.10,500 వరకు హెల్పర్లకు వేతనాలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పెంచడంతో రెట్టింపు ఉత్సాహంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు అందించారు.

ఆరునెలలుగా విడుదల కాని బకాయిలు..

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నిర్వహణలోని ఏడు ప్రాజెక్టుల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఆరు నెలల నుంచి అద్దె బకాయిలు నిలిచిపోయాయి. దీంతో ఇంటి యజమానులు టీచర్ల బకాయిల కోసం వేధిస్తుండడంతో తప్పనిసరి పరిస్థితిలో టీచర్లే బకాయిలు చెల్లిస్తున్నారు. దీంతో ప్రతి నెల అంగన్‌వాడీ టీచర్లపై దాదాపుగా రూ.22 లక్షల పైచిలుకు భారం పడుతున్నది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం మార్చి నుంచి పూర్తిగా అద్దె బకాయిల చెల్లింపు ఆగిపోవడంతో జిల్లావ్యాప్తంగా ఇంచుమించు రూ.1.20 లక్షల వరకు టీచర్లే చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అర్బన్ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న టీచర్లు నెలకు ఒక్కంటికి రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు తమ వేతనం నుంచి చెల్లించడం విశేషం. ఇది చాలదు అన్నట్లు కూరగాయలు, గ్యాస్ బిల్లులు సైతం తోడుకావడంతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పొద్దున లేచిన కాడి నుంచి సాయంత్రం వరకు కేంద్రం నిర్వహణ, ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ, ఇంటింటి సందర్శనలకు తోడు వైద్యారోగ్య శాఖకు సంబంధించిన విధులు, బీఎల్‌వోల డ్యూటీలు చేస్తూ విసిగివేసారిపోతున్న అంగన్‌వాడీ టీచర్ల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అనేక సేవలు కొనసాగిస్తున్న అంగన్‌వాడీలకు ఆర్థిక భారం పెనుముప్పు కావడంతో సదరు కుటుంబాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే అద్దె బకాయిల నిధులు విడుదల చేయాలని, లేదంటే టీచర్ల సమస్యలపై ఉద్యమం తీవ్రతరం చేస్తామని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ల నాయకులు హెచ్చరిస్తున్నారు.

ప్రజా ప్రభుత్వమైతే ఈ తిప్పలేమిటి?

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అయితే అంగన్‌వాడీ టీచర్లను ఈ తిప్పలు ఎందుకు పెడుతున్నారు. ఒక్కో టీచర్ ఇప్పటికే దాదాపు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అద్దె బకాయిల గురించి టీచర్లు అడిగే పరిస్థితి లేకుండా ప్రాజెక్టు అధికారులు కట్టడి చేస్తున్నారు. కనీసం కూరగాయలు, గ్యాస్ సిలిండర్‌కు పెట్టిన పెట్టుబడి ఏ నెలకు ఆ నెల ఎందుకు ఇవ్వలేక పోతున్నారు. ఏ టీచర్ ప్రస్తుతం ఇంటికి ఒక్క రూపాయి వేతనం తీసుకెళ్లడం లేదు. పెట్టుబడులకే వారి జీతం సరిపోతున్నది. కనీసం రిపోర్టులు నమోదు చేసేందుకు సహకరించే సెల్‌ఫోన్‌లు ఇవ్వలేదు. ఐదారు శాఖల పనులు మొత్తం టీచర్లకే అప్పజెపుతూ ఇబ్బంది పెట్టడం సరికాదు. సమస్యలు పరిష్కరించపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తాం.

– సీతామహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

పెండింగ్ బిల్లుల రిపోర్టులు పంపించాం..

అంగన్‌వాడీ కేంద్రాలకు చెల్లించాల్సిన అద్దె బకాయిలు ఉన్నమాట వాస్తవమే. ఏయే ప్రాజెక్టుకు ఎంత బిల్లులు రావాలి అనే రిపోర్టులను రాష్ట్రస్థాయి అధికారులకు పంపించాం. కూరగాయల బిల్లులు, గ్యాస్ బిల్లులు జూలై వరకు క్లియర్ చేశాం. ప్రాజెక్టుల నుంచి రిపోర్టులు రాగానే మిగిలిన బకాయిలను సైతం విడుదల చేస్తాం. అద్దె బకాయిల నిధులు రాష్ట్రస్థాయి అధికారులు విడుదల చేయాల్సి ఉంటుంది. మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కే.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి, ఖమ్మం

'నా కుమారుడి వివాహానికి రండి'

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర ఆహ్వానం

ఖమ్మం వ్యవసాయం/ సత్తుపల్లి, సెప్టెంబర్ 20: వచ్చే నెల 13న హైదరాబాద్‌లో జరిగే తన పెద్ద కుమారుడు భార్గవ్ వివాహ మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య.. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆహ్వానపత్రికను అందించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయక్షేత్రానికి శుక్రవారం వెళ్లిన సండ్ర.. పార్టీ అధినేతను కలిసి తన పెద్ద కుమారుడి వివాహానికి ఆహ్వానించారు. అంతకుముందు ఎంపీ వద్దిరాజు రవిచంద్రను సండ్ర ప్రత్యేకంగా కలిసి తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు.

ధాన్యం కొనుగోళ్లకు..

జిల్లాలో 236 కేంద్రాలు

వానకాలం ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి: ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 20: జిల్లాలో వానకాలం ధాన్యం కొనుగోళ్లకు 236 కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అక్టోబర్ ఒకటో తేదీ నుంచి వీటిని ప్రారంభించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. వానకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లపై అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్‌నాయక్‌లతో కలిసి ఆయా శాఖల అధికారుల కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో తూకం, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పంట దిగుబడి ఆధారంగా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో 6.77 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందనే అంచనా ఉందున్నారు. 4.24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు 236 కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు సన్యాసయ్య, చందన్‌కుమార్, శ్రీలత, పుల్లయ్య, వెంకటరమణ, విజయ్‌కుమార్, అలీం, సందీప్, ఆసిఫ్, అన్వర్, నూరుద్దీన్, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ మీటింగ్‌కు హాజరుకావాలి

ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులతో నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌కు ఉపాధ్యాయులు కచ్చితంగా హాజరుకావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎంలతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సమావేశాల కోసం షెడ్యూల్ ప్రకారం అజెండా అంశాలను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థుల ప్రతిభ, చదువులో వెనుకబడిన వారి పరిస్థితి గురించి తల్లిదండ్రులతో చర్చించాలని సూచించారు. ఇటీవల వరద ముంపునకు గురైన పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, పెన్నులు పంపిణీ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ దసరా సెలవుల తర్వాత ఎంపిక చేసిన పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ తరగతులు నిర్వహించాలన్నారు. అధికారులు సోమశేఖరశర్మ, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

ఖమ్మం జిల్లాలో అక్కడక్కడా తేలికపాటి జల్లులు

ఖమ్మంలో కురుస్తున్న వర్షంలో వెళ్తున్న వాహనదారులు

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 20: బంగాళాఖాతంలో మరోసారి అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో శుక్రవారం సాయంత్రం ఖమ్మంతోపాటు జిల్లాలోని పలు మండలాల్లో దట్టమైన మేఘాలు అలుముకొని తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఈ నెల మొదటివారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలకు అతలాకుతలమైన పంటపొలాల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. కాలువలకు పడిన గండ్లను పూడ్చివేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి నివేదికను సిద్ధం చేసే పనిలో వ్యవసాయశాఖ అధికారులు ఉన్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో మరోసారి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గడిచిన వారం రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సైతం వాతావరణం పొడిగానే కనపడింది. సాయంత్రం వేళ ఒక్కసారిగా చీకట్లు కమ్మడంతోపాటు ఆ వెంటనే వానజల్లులు కురిశాయి. రానున్న రెండ్రోజుల్లో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, తద్వారా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

ప్రకాశ్‌నగర్ వంతెనపై..

రాకపోకలను పునరుద్ధరించాలి

- 20 రోజులవుతున్నా మరమ్మతులు ఎందుకు చేయడంలేదు?
- జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఏముంది ప్రయోజనం?
- ఖమ్మం నగరంలోని మున్నేరు వంతెన వద్ద ప్రజల ఆందోళన

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 20: ఖమ్మం నగరంలోని మున్నేరు వాగుపై నిర్మించిన ప్రకాశ్‌నగర్ వంతెనపై రాకపోకలను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం నగరవాసులతోపాటు సమీప గ్రామాల ప్రజలు బ్రిడ్జి వద్ద ఆందోళన చేశారు. వివరాల్లోకెళ్తే.. ఇటీవలి భారీ వరదల కారణంగా మున్నేరు పొంగి ప్రవహించడంతో ప్రకాశ్‌నగర్ వద్ద ఉన్న బ్రిడ్జి స్వల్పంగా దెబ్బతిన్నది. దీంతో మరమ్మతుల పేరుతో అధికారులు ఈ నెల 1 నుంచి ఆ బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేశారు. ఏకంగా బ్రిడ్జిపైన ఇరువైపులా చిన్నపాటి గోడను సైతం నిర్మించారు. దీంతో అప్పటి నుంచి సమీప గ్రామాల ప్రజలు గోడ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ముదిగొండ, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాలకు చెందిన ప్రజలు నిత్యం ఇదే బ్రిడ్జిపై నుంచి ఖమ్మం నగరానికి వచ్చి పోతుంటారు. ప్రస్తుతం దీనిపై రాకపోకలను నిషేధించడంతో కాల్వొడ్డు బ్రిడ్జిపై నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. దీంతో సమయం వృథా అవుతోందని, అదనపు ఇంధన భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రోజులు గడుస్తున్నా మరమ్మతు పనుల్లో పురోగతి లేకపోవడంతో ఆగ్రహించిన ఆయా గ్రామాల ప్రజలు శుక్రవారం బ్రిడ్జి వద్ద ఆందోళన చేపట్టారు. వరదలు తగ్గిపోయి 20 రోజులైనా మరమ్మతులెందుకు చేయడం పూర్తి చేయడం లేదని, జిల్లాలో ముగ్గురు మంత్రులుండి కూడా ప్రయోజన మేముందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరును నిరసిస్తూ భారీ ఎత్తున నినాదాలు చేశారు. రాకపోకలను తక్షణమే పునరుద్ధరించకపోతే చుట్టుపక్కల గ్రామాల ప్రజలను సమీకరించి భారీఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఖమ్మంలో ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు వంతెనను పునరుద్ధరించాలంటూ ధర్నా చేస్తున్న స్థానికులు